క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న గిరిజన సంఘాల నేతలు

కుల్కచర్ల: జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికైన రమేష్ కుమార్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలందించే ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా రమేష్‌కుమార్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్ నాయక్, బలరాం నాయక్, గోపాల్, రాము నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రవీందర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దౌల్తాబాద్: మండల ఎంపీఓ రవీందర్ ఈ నెల 26న కలెక్టరు నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆయన్ను మంగళవారం ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో 'కంటి వెలుగు'

కొడంగల్: మండలంలోని పలు తండాల్లో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పల్గురాళ్ల తండా, గోప్యానాయక్ తండా, ఎక్క చెరువు తండాల్లో కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు కంటి పరీక్షలు చేసి మందులు, అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

కొడంగల్: పట్టణంలోని కార్గిల్ కాలనీ సమీపంలో మంగళవారం అభివృద్ధి పనులను కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, మధుయాదవ్ ప్రారంభించారు. కాలనీలోని కంప చెట్లను తొలగించి మురుగు కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరాజొద్దీన్



సిరాజొద్దీన్‌కు నియామకపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ మోమిన్‌పేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వారాల సిరాజొద్దీన్‌ను నియమిస్తూ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. మండలంలోని పార్టీ నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరుగులేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మహేందర్‌రెడ్డి, శుభాష్ గౌడు, నర్సింలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు



తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో తాగునీటి సరఫరాలో ఏర్పడిన లీకేజీలకు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

జంతువులను హింసించొద్దు

జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి అనిల్‌కుమార్



వికారాబాద్ అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ప్రతి వ్యక్తికీ జంతువులపై కరుణ ఉండాలని, వాటిని హింసించరాదని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో జంతు సంరక్షణ పక్షోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. పక్షోత్సవాల ముగింపు సందర్భంగా కొత్త గడి జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు విధిగా టీకాలు వేయించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి జంతు సంరక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్థక సహాయ సంచాలకులు ప్రహ్లాద్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాల వ్యాధులపై అప్రమత్తత అవసరం

మోమిన్‌పేట: పశువులకు వచ్చే దీర్ఘకాల వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి గీత సూచించారు. మంగళవారం మండలంలోని బూర్గుపల్లిలో ఆడ లేగ దూడల్లో బ్రుసిలోసిస్ వ్యాధి నివారణలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేగ దూడలు ఎదిగిన తర్వాత వాటికి గర్భకోశ వ్యాధులు రాకుండా చిన్నప్పుడే టీకా వేయించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పశుపోషణపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

టీకాలు వేయించాలి

దోమ: కాలనుగుణంగా వచ్చే వ్యాధుల నుంచి పశువులను సంరక్షించుకునేందుకు రైతులు వాటికి టీకాలు వేయించాలని బొంపల్లి ఉప కేంద్రం పశువైద్యశాల కంపౌండర్ బాబు తెలిపారు. చలికాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆడ లేగదూడలకు బ్రూసెల్లోసిస్ టీకా వేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో ఎక్కువగా పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వాక్సిన్ వేయించడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు.

జంతువులకూ బతికే హక్కు ఉంది

బంట్వారం: భూమిపై ఉన్న ప్రతి జంతువులకూ బతికే హక్కు ఉందని కోట్‌పల్లి వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని బార్వాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణ అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంతువులకు హాని తలపెట్టకుండా ప్రేమతో ఆదరించాలన్నారు. పశు సంపదను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ వెంకటరత్నం, ఉపాధ్యాయులు వేణుగోపాల్, అనిత, రాజశేఖర్, విజయ, ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

చైర్మన్ అశోక్‌కుమార్




పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కోర్టు రోడ్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో మంగళవారం మరమ్మతులు చేయించారు. అనంతరం పలు కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. పరిగి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఇందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, మున్సిపల్ మేనేజర్ నరేష్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఇక్కడ.. ఫైన్ అక్కడ

వాహన నంబరు తప్పుగా నమోదు చేయడంతో ఏపీఎంకు ఫైన్



ఏపీఎం ఫోన్‌కు వచ్చిన మెసేజ్

దౌల్తాబాద్: మండల ఏపీఎం సాయన్న సెల్ ఫోన్‌కు మంగళవారం సాయంత్రం ఓ మెసేజ్ వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ దగ్గర హెల్మెట్ లేకుండా టీఎస్ 06 ఈడీ 7549 బైక్ నడిపారని రూ. 135 జరిమానా చెల్లించాలని పంపించారు. బైక్‌పై హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ఫొటోను సైతం అప్‌లోడ్ చేశారు. ఇది చూసిన సదరు ఏపీఎం రాజాపూర్ వెళ్లకుండానే జరిమానా ఎలా విధించారని వాహనం ఫొటో పరిశీలించారు. అది తప్పుగా నమోదైందని తెలిసింది. ఈ విషయమై ఏపీఎం ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా నిబంధనలు ఉల్లంఘించిన వారికి మాత్రమే జరిమానాలు విధించాలని, బైక్ నంబర్ సరి చేసుకోవాలని ఆయన కోరారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం



రైసు మిల్లు, గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- రైసు మిల్లు, గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన

యాలాల: మాది రైతు ప్రభుత్వమని, అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దౌలాపూర్ వద్ద యాలాల సొసైటీ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రైసు మిల్లు, గోదాంల నిర్మాణ పనులకు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ రైతు ప్రభుత్వమన్నారు. రైతుల ప్రయోజనం కోసం గోదాంలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో నాటిన మొక్కల వివరాలను సర్పంచ్ లక్ష్మిని అడిగారు. పదివేల మొక్కలు నాటామని, అందులో ఏడు వేల మొక్కలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, వైస్ ఎంపీపీ రమేష్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వడ్డే రాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ బాబా, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు గోదాం నిర్మాణ పనులు

పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



గోదాం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

దోమ: రైతుల కోసం నిర్మిస్తున్న గోదాం పనులు తుది దశకు చేరుకున్నాయని పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బొంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ. 1.13 కోట్లతో నిర్మిస్తున్న గోదాం నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మిస్తున్నట్లు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రచార కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ తప్పనిసరి

డీఆర్‌డీఓ కృష్ణన్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కృష్ణన్

మోమిన్‌పేట: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సూచించారు. మంగళవారం మండలంలోని వెల్‌చాల్, మొరంగపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు, బృహత్ ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ఎండు గడ్డిని ఉపాధి కూలీలతో తీయించాలన్నారు. లేకుంటే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా నీరుందించాలని సూచించారు. బృహత్ ప్రకృతి వనం చిట్టడివిని తలపించేలా ఉండాలన్నారు. ప్రతి పల్లెకు స్వచ్ఛమైన గాలిని అందించే లక్ష్యంగా ప్రకృతి వనాలు ఉండాలని ఆకాంక్షించారు. అవసరమైన చోట్ల ఔషధ మొక్కలు నాటాలన్నారు. ప్రతి గ్రామంలో రోజుకు 50మంది కూలీలకు తక్కువ కాకుండా పని కల్పించాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నర్సరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో శంకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: కార్యకర్తలకు, నిరుపేదలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తల్లి శాంతమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆపద సమయాల్లో ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం కుల్కచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు మహేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో బీజేపీ రాష్ట్ర నాయకులు మిట్ట పరమేశ్వర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గండీడ్ మండలం రెడ్డిపల్లికి చెందిన చెన్నయ్య, చౌడాపూర్ మండలం అడవి వెంకటపూర్‌కు చెందిన గోప్యనాయక్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో మంగళవారం వారికి సీఎం సహాయ నిధి కింద రూ. 5లక్షలు, రూ. 2లక్షల విలువ చేసే ఎల్‌ఓసీ పత్రాలను తన నివాసంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది నిరు పేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. అర్హులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేనవిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయన్నారు. నిరుపేద ప్రజలు దర్జాగా బతుకుతున్నారంటే అది కేవలం తెలంగాణలోనే అని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బాధితులను ఆదుకుంటాం:ఎమ్మెల్యే పట్నం

కొడంగల్: పట్టణ పరిధిలోని కార్గిల్ కాలనీలో గతంలో విద్యుత్ షాక్‌తో చనిపోయిన కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కార్గిల్ కాలనీ, సన్ సిటీ కాలనీల్లో పర్యటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందలే చూస్తామన్నారు. అనంతరం ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యను తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచు రమేష్‌బాబు పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు ప్రభుత్వ అండ

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



దంపతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు: కులాంతర వివాహాలు చేసుకొన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్ రెండేళ్ల క్రితం మెదక్ జిల్లాకు చెందిన మహిళను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3లక్షల విలువ చేసే చెక్కును మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన



మర్పల్లిలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న తహసీల్దార్ శ్రీధర్

మర్పల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో కల్పించిన వసతులపై ఆరా తీశారు. ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రతి రోజూ 60 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు చేయాలని వైద్యులకు సూచించారు. మర్పల్లి, పట్లూర్ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతున్నట్లు దండోరా వేయించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, పట్లూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అమరేశ్వరీ, ఏఎన్‌ఎం రైసాబేగం పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

అనంతగిరి: మండలంలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య ఆదేశించారు. మంగళవారం ఉపాధి పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో 50మందికి తగ్గకుండా పనులు చేసేలా చూడాలన్నారు. ఏపీఓ శీను, ఈసీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటాం

టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింలు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింలు

కొడంగల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీకి ప్రజల ఆదరణ ఎప్పటికీ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలో టీడీపీని అభిమానించే కార్యకర్తలు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీకే రాములు, తలారీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్‌లో వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. మంగళవారం సర్పంచ్ లక్ష్మి, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. వీధుల్లో విహరించిన స్వామివారిని ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు అనంతయ్య, కృష్ణయ్య, వెంకట్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సదరం స్లాట్ల సంఖ్య పెంచాలి

దోమ: పరిగి నియోజవర్గానికి సదరం స్లాట్ సంఖ్యను పెంచాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి మంగళవారం కోరారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం విడుదలైన రెండు వందల సదరం స్లాట్లు దివ్యాంగులకు సరిపోలేదని తెలిపారు. వికారాబాద్, తాండూరు పట్టణ ప్రాంతాల్లో కొందరు మీ సేవ ఆపరేటర్లు అడ్వాన్స్‌గా దివ్యాంగుల వివరాలను తీసుకోని వారి నుంచి అధిక డబ్బులు వసూలు చేసి స్లాట్‌లను బుక్ చేసి వారికి అందజేస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామీణ ప్రాంత దివ్యాంగులకు మీ సేవ కేంద్రాలలో స్లాట్లు దొరక్క నానా అవస్థలు పడుతున్నారని అన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధారూరు: పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వికారాబాద్ రూరల్, మియాపూర్ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం సైకిళ్లు అందజేశారు. వివిధ గ్రామాల నుంచి ధారూరుకు కాలినడకన వచ్చే విద్యార్థుల అవస్థలను గుర్తించి లయన్స్ క్లబ్ సైకిళ్లు సమకూర్చింది. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయకుమార్, లయన్స్ క్లబ్ బాధ్యులు జనార్దన్‌రెడ్డి, శ్రీనిసుందర్‌రావు, హెచ్‌ఎం దేవియా, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జే హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బసప్ప, టీఆర్‌ఎస్ నాయకులు ఇబ్రాహీం, హఫీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.